

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	583.80 (296.5695)	3,74,658	2,70,900
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	334.54	277.56
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	168.86 (36.78)	2,50,518	2,78,573

చికెన్ ధరలు	లైవ్ : రూ.108	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.200

సాగు.. సగమే

» అదును దాటుతోంది » ఇప్పటివరకు 2.91లక్షల ఎకరాల్లో సాగు



జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వానాకాలంలో నిత్యం సెంటీమీటర్లలో కురవాల్సిన వర్షం ఒక్క మి.మీ.లలో కూడా నమోదు కావడంలేదు. పంటలు సాగు చేసేందుకు అదును దాటుతోంది. ఈ సీజన్‌లో జూన్, జూలై నెలల్లో పెద్దగా వర్షాలు కురవలేదు. ఆగస్టు మొదటివారం దాటుతున్నప్పటికీ వాన జాడ కన్పించడంలేదు. వరి పొలాల్లో నారుమళ్లు నాటేందుకు రైతులు సిద్ధం చేసుకున్నారు. అయితే భారీ వర్షాలు కురవకపోవడంతో వరి నాటాలా? వద్దా ? అన్న సందిగ్ధంలో పడ్డారు. రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

వానాకాలంలో ఇప్పటివరకు సాధారణంగా 276.0 మి.మీ.ల వర్షపాతానికి 242.9 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధరణం కంటే కూడా 12శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. గత సీజన్‌లో ఇప్పటివరకు చాలా మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైన ఘటనలున్నాయి. అయితే ఈసారి మాత్రం జిల్లాలోని 14 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదుకాగా... యాదగిరిగుట్ట, చౌటుప్పల్, గుండాల మండలాల్లో సాధారణం కంటే లోటుగా నమోదైంది. ఈ నేపథ్యంలో పంటలు సాగుచేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. జిల్లాలో సాగు సగమే అన్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటివరకు 2.91లక్షల ఎకరాల్లో సాగు

వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 4,28,850 ఎకరాల్లో పలు పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి 2,80,000, పత్తి 1,35,000 ఎకరాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, తదితర పంటలు సాగుచేస్తారని అంచనాలు రూపొందించింది. జిలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.దీంతో సాగువిస్తీర్ణం తగ్గింది.వానాకాలంలోఇప్పటివరకు రైతులు 2,91,139 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. వీటిలో వరి 1,80,969 ఎకరాల్లో, పత్తి 1,00,514 ఎకరాల్లో, కందులు 2693 ఎకరాల్లో, ఇతర పంటలు 6963 ఎకరాల్లో సాగుచేశారు. జిల్లాలో వరి అత్యధికంగా సాగవుతోంది. అత్యధికంగా మూసీ పరివాహక ప్రాంతాల్లోనే వరికి ప్రాధాన్యం ఇస్తారు. మిగతా చోట్ల నీటిలభ్యతను బట్టి సాగుచేస్తారు. అయితే జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రైతులు పత్తిని పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పత్తి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే వర్షాల్లేకపోవడంతో పత్తి సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. కేవలం వ్యవసాయ బోర్లలో నీరు ఉన్నవారు మాత్రమే పండిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పంటల సాగు వివరాలు

రైతులు ప్రతీ సీజన్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్న సమాచారం విత్తనాల విక్రయాలను బట్టి లెక్కిస్తుంటారు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా దుకాణాల వద్ద తీసుకున్న విత్తనాలు రైతులు సాగుచేస్తున్నారా? లేదా? అన్నది పూర్తి సమాచారం అందడంలేదు. ఈ నేపథ్యంలో వానాకాలం, యాసంగిలో జిల్లాలో సాగుచేస్తున్న పంటలపై సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ఇందుకోసం సర్వే చేపట్టాలని ప్రభుత్వం వ్యవసాయశాఖకు ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సాగును పరిశీలించి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్‌ను రూపొందించింది. జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానాకాలం పంటల వివరాలు సేకరిస్తున్నారు. జూలైలో మొదలైన ఈ సర్వే ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందుకనుగుణంగా జిల్లాలోని 17 మండలాల్లోని 421 గ్రామాలు, ఆరు మునిసిపాలిటీల్లో వివరాలను క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో సర్వే ఆఖరు దశకు చేరుకున్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఈ సర్వే లెక్కల ఆధారంగానే భవిష్యత్‌లో సాగు విస్తీర్ణం, పంటల దిగుబడులు పరిగణలోకి తీసుకుని మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధరలు నిర్ణయించనున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది.

రైల్వే డబ్లింగ్‌కు భూ సర్వే



రైల్వే డబ్లింగ్ పనులకు రైల్వేశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. రెండో లైన్ ఏర్పాటుకు కావల్సిన భూసేకరణ పనులు చేపట్టింది. బీబీనగర్-నడికుడి మార్గంలో గత ఏడాది ఆగస్టులో రెండోలైన్‌కు ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్ గత నెల జూన్ నుంచి భూసేకరణ పనులు చేపట్టింది. సుమారు 48కి.మీ భూసేకరణ పనులు పూర్తి చేసిన అధికారులు సర్వే కోసం రెవెన్యూశాఖ ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం.

– మిర్యాలగూడ



బీబీనగర్-నడికుడి మార్గంలో రెండో లైన్ »

48కి.మీ మేర 98శాతం భూసేకరణ పూర్తి »

డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైన్‌కు ఎఫ్ఎల్ఎస్‌ను రైల్వేశాఖ గత సెప్టెంబరులో మంజూరు చేసింది. డబ్లింగ్‌తో పాటు నూతన రైల్వేలైన్ పూర్తయితే నడికుడి, బీబీనగర్‌లా మిర్యాలగూడ రైల్వే జంక్షన్‌గా రూపాంతరం చెందనుంది. ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య ప్రయాణదూరం తగ్గించేలా రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో తెలంగాణలో డోర్నకల్-మిర్యాలగూడ రైల్వే లైన్ ఏర్పాటుకు గత ఏడాది 120 కి.మీ ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్‌సీ) మంజూరు చేసింది. దీంతో ఆయా ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడటమేగాక రెండు లైన్లతో ఈ ప్రాంతాల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా వేగంగా గమ్యాన్ని చేరే అవకాశం ఉందని రైల్వే ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు అదనపు ప్రయోజనం

డబ్లింగ్‌తో రైళ్ల సంఖ్యను పెంచేందుకు వీలుకలగడమేగాక ఒకే లైన్‌తో రైళ్ల రాకపోకల్లో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించవచ్చునని అధికారులు భావిస్తున్నారు. డబ్లింగ్‌తో సెక్షన్ సామర్థ్యం పెరిగి ఎక్కువ రైళ్లు నడవనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడతో పాటు ఏపీ రాష్ట్రంలోని దాచెపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు వరకు ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. రైల్వే స్టేషన్లలో పటిష్ఠ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు నూతన ప్లాట్‌ఫాంలు, ఆధునిక విశ్రాంతి గదులు, రైళ్ల రాకపోకల సమయాన్ని సూచించే డిజిటల్ బోర్డులు సహా పలు వసతులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.



యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా సులభం

జిల్లాలో రూ.2,160 కోట్ల అంచనా వ్యయంతో 120కి.మీ మేర చేపట్టనున్న డోర్నకల్-మిర్యాలగూడ నూతన రైల్వే లైన్ నిర్మాణంతో దక్షిణ తెలంగాణకు ప్రయోజనం చేకూరనుంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటుచేయనున్న కొత్త రైల్వే మార్గంతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. వ్యవసాయం, వ్యాపారం, విద్య, పర్యాటకం లాంటి పలు రంగాల్లో సామాన్య ప్రజల ప్రయాణ అవసరాలు తీరనున్నా యి. వచ్చే డిసెంబరు నాటికి రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించే లక్ష్యంతో నిర్మాణ పనులు కొనసాగిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకు బొగ్గు రవాణాను ఈ నూతన రైల్వే మార్గం సులభతరం చేయనుంది. డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైన్ సింగరేణి కాలరీస్ నుంచి రానున్న బొగ్గును వైటీపీకి చేర్చేందుకు అనువుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు హుజూర్‌గర్, కోదాడ ప్రాంతాల పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు రవాణాకు అనువుగా ఉంటుందని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటాయని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కుక్కడం-నడికుడి మధ్య భూసేకరణ పూర్తి

బీబీనగర్-నడికుడి 248కి.మీ రెండోలైన్ ఏర్పాటుకు రైల్వేశాఖ కసరత్తు ప్రారంభించింది. రూ2,853.23కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా భూసేకరణ పనులు కొనసాగుతున్నట్టు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం నుంచి గుంటూరు జిల్లా నడికుడి వరకు 48కి.మీ మేర భూసేకరణ పనులు 98 శాతం పూర్తి చేసినట్టు తెలుస్తోంది. రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల సమయంలో వెహికల్ పార్కింగ్, రవాణా కోసం భూసర్వే చేపట్టాల్సిందిగా జిల్లా రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. రెండో లైన్ ఏర్పాటులో వాడపల్లి వద్ద కృష్ణానదిపై రైల్వే వంతెన నిర్మాణంతో పాటు సుమారు 198 చోట్ల బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉన్నందున, డబ్లింగ్ పూర్తయ్యేందుకు మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

25శాతం పనులు పూర్తి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన పను లు 25 శాతం వరకు పూర్తయ్యాయి. ప్లాట్‌ఫాం పను లు పూర్తికాగా, ఇతర అప్‌గ్రేడ్ పనులు కొనసాగుతున్నా యి.కాంట్రాక్టర్‌తో చర్చించి నిర్ణీతకాలంలో పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– తారకేశ్వరరాజు, మిర్యాలగూడ రైల్వే స్టేషన్ మేనేజర్

డబ్లింగ్ సర్వే పనులు కొనసాగుతున్నాయి

డబ్లింగ్‌కు యాదాద్రి జిల్లాలో రెవెన్యూశాఖ అధికారులతో కలిసి సర్వే నిర్వహించాం. మిర్యాలగూడ డివిజన్ కుక్కడం-వాడపల్లి మధ్య కొన్ని చోట్ల భూ సర్వే కొరకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారు సర్వేయర్లను ఏర్పాటు చేస్తే తక్కువ సమయంలోనే సర్వేను పూర్తి చేస్తాం.

– లక్ష్మణ్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్



రూ.9.5కోట్లతో మిర్యాలగూడ స్టేషన్‌కు కొత్తహంగులు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణలో చేపట్టిన 15 స్టేషన్ల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు గత ఫిబ్రవరిలో రూ.9.5కోట్లు మంజూరు చేసింది. వీటితో స్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టినట్టు రైల్వే అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా రైల్వే ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫాం ఆధునికీకరణ,లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్,వెయిటింగ్ ఏరియా, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, బహుళ స్థాయి పార్కింగ్ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ప్లాట్‌ఫాం పనులు పూర్తికాగా,ఇతర పనులు కొనసాగుతున్నాయి.



రామన్నపేట వద్ద సర్వే నిర్వహిస్తున్న రైల్వే అధికారులు (ఫైల్)

చేనేతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

» అగ్గిపెట్టెలో పట్టే చీరలు నేసిన నేతన్నలు పస్తులుండొద్దు » ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి అర్బన్, ఆగస్టు 7: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాలకు అండగా ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాయిగిరి క్రాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వద్దకు చేనేత కార్మికుల భారీ ర్యాలీని విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగేలతో కలిసి ప్రారంభించారు.ముందుగా చేనేత కళను కాపాడేందుకు ప్రతిజ్ఞచేశారు. ఇందులో భాగంగా కార్మికులకు చేనేత చేయూత, నేతన్న బీమా పథకంలో చెక్కులను అందజేశారు. అనంతరం చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. 1905లో విదేశీ వస్త్రం వద్దు స్వదేశీ వస్త్రం ముద్దు అని ఉద్యమం కొనసాగిందన్నారు. 2015 ఆగస్టు 7నుంచి జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. అగ్గిపెట్టెలో పట్టే చీరలు నేసిన చేనేత కార్మికులు పస్తులుండకూడదన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాతో 60లక్షల మంది రైతులకు రూ.31కోట్ల మేలు చేస్తుందన్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ జిల్లాలో పోచంపల్లి డిజైన్ ప్రసిద్ధి పొందినందున చేనేత కుటుంబాలను కలిసేందుకు గత డిసెంబరులో రాష్ట్రపతి వచ్చారని చెప్పారు.నైపుణ్యంతోపాటు రంగుల తయారీ కూడా అద్భుతంగా ఉందన్నారు. ఈసందర్భంగా చేనేత సొసైటీ ప్రతినిధులు గర్దాసు బాలయ్య, పిల్లలమర్రి శ్రీనివాసులు, దుడుక ఉప్పలయ్య చేనేత రంగ పరిస్థితులపై మాట్లాడారు. కార్యక్రమంలో డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, చేనేత, జౌళీ శాఖ అసిస్టెంట్ డెరెక్టర్ కామిల్‌అహ్మద్, చేనేత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గుట్టలో చేనేత కార్మికుల దినోత్సవంలో భాగంగా పట్టణంలో లక్ష్మీనరసింహస్వామి సిల్క్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం, అధ్యక్ష కార్యదర్శులు నార నరేందర్, మెరుగు కిష్టయ్య, బడుగు మల్లేశం, నాయకులు దీకొండ జోగయ్య, ఎర్రగుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

భువనగిరిరూరల్: నేతన్నల కుటుంబాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు విప్ అయిలయ్య తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నేతలు తంగెళ్లపల్లి రవికుమార్, నానం కృష్ణ, ఎలిమినేటి కృష్ణారెడ్డి, పాశం శివ, పల్లెర్ల యాదగిరి, చుంచు నాగభూషణం, బింగి భిక్షపతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీర్ల అయిలయ్య అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆలేరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మైనార్టీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అత్యధిక ప్రజలు చేనేత వృత్తినే చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. సమావేశంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు పాశికంటి శ్రీనివాస్, బింగి నర్సింహులు, మహేందర్, పాల్గొన్నారు.

దేశానికి రైతన్న, నేతన్న రెండు కళ్లు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద



సభలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద

భూదాన్‌పోచంపల్లి: దేశానికి రైతన్న, నేతన్న రెండు కళ్లు లాంటి వారని వీరిద్దరూ బాగుంటేనే దేశం బాగుంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భూదాన్‌పోచంపల్లి పట్టణంలో చేనేత దినోత్సవం కార్యక్రమం, ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత పాలకులు మహిళల సంక్షేమం కోసం, చేనేత కోసం ఏం చేశారో అనే విషయం పక్కన పెట్టి ప్రస్తుతం ఉన్న సమస్యలపై చర్చించాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాల మహిళలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని, చేనేత రంగంలో విశేష కృషి చేస్తున్న మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు పూర్తికావాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 7: జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిన మరమ్మతులు ఈ నెల 15లోగా పూర్తి కావాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్షించి మాట్లాడారు. మైనర్ మ రమ్మతులు, విద్యుత్ వైరింగ్, కలర్ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. బోర్డులపై రాసే అక్షరాలు విద్యార్థులకు కనపడేలా ట్యూబ్ లైట్లు ఏర్పాటు చే యాలన్నారు. గ్రామాలకు సంబంధించిన మౌలిక వసతులను ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ పనులు పకడ్బందీగా అమలుచేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ ఫాగింగ్ పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఒకవేళ ఉంటే ఆయిల్ బాల్స్‌వేసి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. మంచినీరు ప్రతీ ఇంటికి అందజేయాలని, పైపులైన్లు లీకేజీలను అరికట్టి మంచినీరు వృథా కాకుండా చూడాలని, లేదంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతీ ఇంటికి పండ్లు, పూలకు సంబంధించి ఆరు మొక్కలు అందజేయాలని, గృహ యజమానులు మొక్కలు నాటేలా ప్రోత్సహించాలన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జడ్పీ సీఈవో శోభరాణి, డీపీవో ఆర్.సునంద, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జీ విద్యాశాఖ అధికారి ప్రశాంత్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో సురేష్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో ప్రజలందరూ పాల్గొనాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంతోపాటు నర్సరీని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ అమానుషం

దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భట్టు రాంచంద్రయ్య




సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రయ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 7: చోరీ నెపంతో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానుషమని, బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భట్టు రాంచంద్రయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. బుధవారం భువనగిరిలో వేదిక సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా దళితులపై పాలకుల వివక్ష మారలేదన్నారు. చేయని నేరానికి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించి దళిత మహిళను పోలీసులు విచక్షణారహితంగా కొట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందికపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సంఘాల ప్రతినిధులు సురుపంగ శివలింగం, ఇటికల దేవేందర్, దర్గాయి హరిప్రసాద్, బర్రె సుదర్శన్, అన్నంపట్ల కృష్ణ, సిరిపంగ సుభాష్ పాల్గొన్నారు.

గుట్టలో నీటికొరత నివారణకు కృషి

» ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య » రూ.38.60కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గుట్టలో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 7: యాదగిరిగుట్ట పట్టణంలో నీటికొరత నివారణకు నీటి ట్యాంకులు నిర్మిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. బుధవారం గుట్టలో అమృత్ పథకం ద్వారా మంజూరైన రూ.38.60కోట్లతో మూడు వాటర్ ట్యాంకులు, శ్మశాన వాటిక ప్రహరీ, మినీ వాటర్ ట్యాంకులు, మురుగుదొడ్లు, ఆర్చ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టలో స్థానిక ప్రజలతోపాటు ప్రతీరోజు వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారందరికీ నీటి సమస్య రాకుండా నీటి ట్యాంకులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ వీధికి నూతన పైపులైన్లు ఏర్పాటు చేయిస్తూ నీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. దాంతోపాటు శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు, మినీ వాటర్‌ట్యాంకులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్టను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మున్సిపల్ కమిషనరు అజయ్‌కుమార్, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు కౌలికార్ అరుణ, బూడిద సురేందర్, సీసీ విజయలక్ష్మీ, గుండ్లపల్లి వాణి, బిట్టు సరోజ, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, తాళ్లపల్లి నాగరాజు, బబ్బూరి మౌనిక, కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, సయ్యద్‌బాబ తదితరలు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 7: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకించి, తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు.ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,81,890ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా హుండీ కానుకలను అధికారులు, సిబ్బంది లెక్కించగా ఖజానాకు రూ.2,66,68,787 ఆదాయం సమకూరాయి.





























ఆయకట్టులో సాగునీటి సవ్వడులు

కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఏడాది తర్వాత నీటి సవ్వడులు ప్రజల్లో ఆనందాలను నింపుతోంది. తాజాగా సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన నీటితో పులిచింతల ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. అటు నదీ ప్రవాహ ప్రాంతంతో పాటు ఆయకట్టు ప్రాంతంలోని కాల్వల్లో నీటి ప్రవాహం భవిష్యత్‌పై భరోసాగా కనిపిస్తోంది. దీంతో అందరిలో ఆనందం కనిపిస్తోంది.



నాగార్జునసాగర్ / కేతేపల్లి, ఆగస్టు 7: నాగార్జునసాగర్‌కు ప్రాజెక్టుకు ఎగువ నుంచి బుధవారం స్వల్పంగా వరద రాక తగ్గింది. దీంతో మంగళవారం 22 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం ఉదయం, మధ్యాహ్నం రెండు చొప్పున నాలుగు గేట్లను మూసివేసి 18 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటినివిడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,32,364 క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885(215.8070 టీఎంసీలు)అడుగులు కాగా, ప్రస్తుతం 883.80(203.4290టీఎంసీలు)అడుగులుగా ఉంది. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 10 అడుగులు మేర ఎత్తి, అలాగే రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 3,74,658క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590(312.5050టీఎంసీలు) అడుగులు కాగా, బుధవారం సాయంత్రానికి 584.80అడుగులు (296.5695టీఎంసీలు)గా ఉంది.సాగర్ నుంచి కుడికాల్వకు 6,873క్యూసెక్కులు, ఎడమకాల్వకు 8,193 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, 4క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు, 14 క్రస్ట్‌గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 2,24,964 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,70,900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఎగువ నుంచి 3,74,658 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



డ్యాంపైన సీసీఎల్ఏ నవీన్ మిత్తల్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సాగర్‌ను సందర్శించిన ప్రముఖులు

సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రముఖులు సాగర్‌ను సందర్శించారు. సాగర్‌ను సందర్శించిన వారిలో సీసీఎల్ఏ నవీన్ మిత్తల్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సూర్యాపేట డిప్యూటీ కలెక్టర్ లత, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కుటుంబసమేతంగా సాగర్ సందర్శించారు. సీసీఎల్ఏ ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్ సాగర్ ప్రధానడ్యాంను సందర్శించిన అనంతరం జలాశయంలో పర్యాటకశాఖ లాంచీలో జాలీ ట్రిప్పులో తిరిగారు.

పనిచేయని రెండో టర్బైన్

నాగార్జునసాగర్ ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలో 80మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బైన్‌లు ఉన్నాయి. అందులో రెండో టర్బైన్‌లోకి 2014 నవంబరులో నీరు చేరడంతో మరమ్మతులకు గురైంది. ఆ తర్వాత రెండేళ్లకు మరమ్మతులు చేసి 2016 నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మరోసారి రెండో టర్బైన్ 2022 డిసెంబరులో మరమ్మతులకు గురైంది. దీంతో అప్పటి నుంచి మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. 2023లో నీటినిల్వలు లేకపోవడంతో విద్యుదుత్పత్తి చేయలేదు. కానీ నేటికీ మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో ప్రస్తుతం ఒక టర్బైన్ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఏడాది తర్వాత ప్రాజెక్టుకు భారీ వరద వస్తున్నా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో కానీ, ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో కానీ జెన్‌కో అధికారులు పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోతున్నారు.

ఈ సీజన్‌లో పెద్దఎత్తున నష్టం

సాగర్‌లో నీటినిల్వలు పుష్కలంగా ఉన్న తరుణంలో రెండో టర్బైన్ మరమ్మతులకు గురికావడం చర్చనీయాంశమైంది. ఎడమ కాల్వపై ఉన్న విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒక్కో టర్బైన్ ద్వారా 80 మెగావాట్ల చొప్పున ప్రతిరోజూ 160 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుండేది. అయితే రెండో టర్బైన్ మరమ్మతుకు గురికావడం ద్వారా మూడు నెలల కాలానికి సుమారు ప్రతి రోజూ 80 మెగావాట్ల చొప్పున 7,200 మెగావాట్ల విద్యుదుత్పత్తిని కోల్పోవాల్సి వస్తోంది. ఒక టర్బైన్ పనిచేస్తున్న సమయంతో పాటు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తుండగా టర్బైన్ మరమ్మతులు సాధ్యం కావని నిపుణులు చెబుతున్నారు. ఆ లెక్కన రెండో టర్బైన్ మరమ్మతులు పూర్తికావడానికి ఏడాది సమయం పట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



డ్యాం ఎదుట పర్యాటక కుటుంబం

నిండుకుండలా పులిచింతల

మేళ్లచెర్వు: ఎగువ నుంచి వరద పోటెత్తడంతో తెలుగురాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటలకు 2,50,518 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టు ఆరు రేడియల్‌గేట్లను రెండున్నర మీటర్లు, ఏడు గేట్లను మూడు మీటర్లు ఎత్తి 2,78,573 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(42.16టీఎంసీలు)అడుగులు కాగా, ప్రస్తుతం 168.86(36.78టీఎంసీ) అడుగులకు చేరుకుంది. విద్యుదుత్పత్తి చేస్తూ 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.వరద నిలకడగా కొనసాగుతుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు.

పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి

పులిచింతల ప్రాజెక్టు వద్ద ఎడమ వైపు ఉన్న తెలంగాణ జెన్‌కో పవర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. మంగళవారం ఉదయం 9గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు 10టీఎంసీలకు చేరుకోగానే 3,600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్లలో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 5,600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. రెండు యూనిట్ల ద్వారా 40 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేశారు. మంగళవారం రాత్రి మరో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. 10వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.





పులిచింతల బ్యాక్‌వాటర్‌లో మునిగిన మట్టపల్లి క్షేత్ర సమీపంలోని మెట్లు

మట్టపల్లి క్షేత్ర కరకట్టకు చేరువలో నీరు

మఠంపల్లి : పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో బ్యాక్‌వాటర్ మట్టపల్లి ఆలయానికి సమీపానికి చేరుకుంటోంది. రెండు రోజుల కిందటి వరకు నీరు లేక పుష్కరఘాట్లు వెలవెలబోయాయి. సాగర్ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టులో గరిష్ఠ నీటి నిల్వలు 42.16 టీఎంసీలకు బుధవారం సాయంత్రానికి 36.78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సమీపంలోని పుష్కరఘాట్లు, మెట్లు పూర్తిగా మునిగిపోయాయి. 2022లో ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీటినిల్వలతో ఆలయంలోకి వరద చేరింది. మరో మూడు టీఎంసీల నీరు పెరిగితే కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలోకి నీరు చేరే అవకాశం ఉంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో





సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మహంకాళిగూడెం వద్ద కృష్ణమ్మ పరువళ్లు

కేతేపల్లి : ఎగువన మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 370.08క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి 334.54 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీలు)అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 641.50 (3.57టీఎంసీ)అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 69.39 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 208.17క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరందిస్తాం: ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, ఆగస్టు 7: దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగు నీరందించే బాధ్యత తనదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ-1 సొరంగం పనులకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి నల్లగొండ జిల్లా డిండి మండలం వీరబోయినపల్లి వద్ద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రైతులు, నీటి పారుదల శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెయిన్‌కాల్వ 22.15 కిలోమీటర్ నుంచి 23.22 కిలోమీటర్ వరకు 1.75 కిలోమీటర్ల సొరంగం పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను కోరారు. మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. డిండి ఎత్తిపోతలకు ఏదుళ్ల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవాలని అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు అధికారులను ఆదేశించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో కల్వకుర్తి ఎత్తిపోతల నీటి ద్వారా డిండి ప్రాజెక్టును నింపి రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. డిండి మండలంలో 67 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మోడల్ స్కూల్ ఆవరణంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, ఏఈ శ్రీధర్‌రావు, జైపాల్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, ఎండీవో డానియెల్, నాగార్జునరెడ్డి, ఎంఈవో సామ్యనాయక్, గుర్రం రాములు, శ్రీనివాస్‌గౌడ్, మేకల సాయమ్మకాశయ్య, జంగారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, పొలం లక్ష్మణ్, గడ్డమీది సాయి, పోల వెంకటేష్, వెంకటయ్య, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, షైనొద్దిన్, లక్‌పతినాయక్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్, వంశీకృష్ణ

26 చెరువులను గోదావరి జలాలతో నింపుతాం

తుర్కపల్లి, ఆగస్టు 7: కొండపోచమ్మ రిజర్వాయర్ నీటితో యాదాద్రిభువనగిరి జిల్లాలోని తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 26 చెరువులను నింపి సాగుకు నీటిని అందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కొండపోచమ్మ రిజర్వాయర్ సమీపంలోని వెంకటాపూర్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన తుర్కపల్లి, తుర్కపల్లి(ఎం) గేట్ల వద్ద అయిలయ్య బుధవారం రాత్రి పూజలు చేసి గేట్లు ఎత్తి సాగునీటిని వదిలారు. దీంతో తుర్కపల్లి కెనాల్, తుర్కపల్లి(ఎం)కెనాల్ ద్వారా గోదావరి జలాలు పరవళ్ళు తొక్కుతూ మండలంలోని గోపాలపురం, కొండాపూర్, వాసాలమర్రి చేరుకున్నాయి. ఇదిలా ఉండగా మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో చెరువుల్లోకి గోదావరి జలాల విడుదలతో ఆయా గ్రామాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఇన్‌చార్జి డీఈలు శ్రీధర్, సురేశ్‌బాబు, ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ ధనావత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ జీ దేశ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొమిరిశెట్టి నర్సింహులు, యాదగిరిగుట్ట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలు యాదవ్, మాజీ ఎంపీటీసీ ధనావతు మోహన్‌బాబు, మండల మహిళా అధ్యక్షురాలు ఐనాల చైతన్య, నాయకులు భూక్య రాజారాంనాయక్, పనగట్ల సుదర్శన్, బోరెడ్డి మహిపాల్‌రెడ్డి, కొన్నె దుర్వాసులు, గడ్డమీది నిఖిల్‌గౌడ్, బాబునాయక్, ఇంద్రపాల కృష్ణ తదితరులు ఉన్నారు.



గేట్ తిప్పుతున్న విప్ అయిలయ్య

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

చౌటుప్పల్ రూరల్ ఆగస్టు 7: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మాడుగుల మండలం గుర్రపుగూడెం గ్రామానికి చెందిన సుంకిరెడ్డి మధుకర్‌రెడ్డి(36) బత్తాయిపండ్ల లోడుతో ట్రాక్టర్ డ్రైవర్ మల్లె వెంకట్‌రెడ్డితో కలిసి బాటసింగారం ఫ్రూట్ మార్కెట్‌కు బయలుదేరాడు. వెనక నుంచి డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ పక్కన మధుకర్‌రెడ్డి తలపగిలి మృతి చెందాడు.

రూ.5కోట్లు అప్పు ఇస్తామని ఆశపెట్టి టోకరా

● 24 గంటల్లో నిందితుల అరెస్ట్‌చేసిన నల్లగొండ జిల్లా పోలీసులు

మిర్యాలగూడ, ఆగస్టు 7: వడ్డీ రూపంలో అప్పు ఇస్తామని చెప్పి రూ.60 లక్షలు టోకరా వేసిన ముఠాను ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నల్లగొండ జిల్లా పోలీసులు పట్టుకుని, కటకటాల్లోకి పంపారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌సమీర్ నిజామాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొత్త వెంచర్ కోసం డబ్బు చెల్లించాల్సి ఉండటంతో అప్పు కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో డబ్బు కోసం శ్రీకాంత్ అనే మధ్యవర్తి ద్వారా నల్లగొండ జిలా మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, కండెల మల్లిఖార్జున్‌ను సంప్రదించాడు.సమీర్‌కు అప్పుగా రూ.5కోట్లు ఇవ్వడానికి ఒప్పుకొని జూలై 31న అతడిని నమ్మించేందుకు రూ.90లక్షలు ఇచ్చారు. సమీర్ నుంచి ఇంటి దస్తావేజులు, ప్రాంసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులు తీసుకున్నారు. మిగతా డబ్బు గురించి అడగ్గా తాము ఇచ్చిన రూ.90లక్షలు, అప్పు ఇవ్వబోయే రూ.5కోట్లకు ముందస్తుగా వడ్డీ రూ.60లక్షలు తీసుకుని ఈ నెల 5వ తేదీన మిర్యాలగూడకు రావాలని చెప్పారు. డబ్బు అత్యవసరం కావడంతో ముందస్తుగా వడ్డీ చెల్లించేందుకు అంగీకరించి మరో ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంట తీసుకుని ముందుగా వారు అప్పుగా ఇచ్చిన రూ.90లక్షలు, ముందస్తు వడ్డీ రూ.60లక్షలు మొత్తం రూ.కోటిన్నర నగదు వెంట తీసుకెళ్లారు. ఈ నెల 5సాయంత్రం 4గంటలకు వారు చెప్పిన అడ్రస్ ప్రకారం మిర్యాలగూడ గాంధీనగర్‌లోని వీరన్న ఇంటికి చేరుకున్నారు. రూ.60లక్షలు కాజేయాలనే పథకంతో ఉన్న నిందితులు గణేష్, మల్లిఖార్జున్, విజయ్, రాజు, గంగమ్మ, ఎల్‌బీనగర్‌కు చెందిన చిక్కుడు వెంట్రుకల వ్యాపారి కండెల అనుపమ, హైదరాబాద్ కొంపెల్లికి చెందిన వంటపని చేసే కండెల వెంకటమ్మ, మిర్యాలగూడ గాంధీనగర్ కండెల వీరమ్మ అప్పటికే ఆ ఇంటికి చేరుకున్నారు. సమీర్ అతడి స్నేహితులతో మాట్లాడి వారి వద్ద నుంచి తాము ఇంతకుముందు ఇచ్చిన రూ.90లక్షలు తీసుకొని చెక్కులు, ప్రాంపసరీ నోట్లు, ఇంటి కాగితాలు వారికి తిరిగి ఇచ్చివేశారు. రూ.5కోట్ల అప్పు గురించి గణేష్, మల్లిఖార్జున్‌లను అడగ్గా వడ్డీ డబ్బులు తెచ్చారా ముందు చూపించాలని సమీర్‌ను అడగడంతో ఆయన తన వెంట తెచ్చిన బ్యాగును తెరిచి రూ.60లక్షలను చూపించబోయాడు. కండెల గణేష్, మల్లిఖార్జున్, విజయ్, రాజు కలిసి సమీర్ అతడి స్నేహితులపై దాడి చేసి నగదు ఉన్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. జరిగిన మోసాన్ని గ్రహించి సమీర్ అతడి స్నేహితులు నిందితులను వెంబడించే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న గంగమ్మ, అనుపమ, వీరమ్మ, వెంకటమ్మ అడ్డుకుని రాళ్లతో దాడి చేస్తూ మరోవైపు పారిపోయారు. తమ డబ్బు దోచుకొని పరారైన ఘటనపై సమీర్ అదేరోజు రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు డీఎస్పీ రాజశేఖరరాజు ఆదేశాల మేరకు వన్‌టౌన్, టౌటౌన్ సీఐలు సుధాకర్, నాగార్జున ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం నిందితులు అనుపమ, వీరమ్మ, గంగమ్మను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.60లక్షల నగదు, డబ్బు లెక్కింపు యంత్రం, యాపిల్, రెడ్‌మీ స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులు మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, మల్లిఖార్జున్‌లు హైదరాబాద్‌కు చెందిన విజయ్, రాజు, వీరన్న, గంగమ్మ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా, పట్టుబడిన నిందితులపై గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు. 24గంటల్లో కేసును ఛేదించిన డీఎస్పీ, సీఐలను ఎస్పీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అనిల్

నేరేడుచర్ల, ఆగస్టు 8: దాడి ఘటనలో ఓ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలవగా, కేసు నమోదు చేస్తారనే భయంతో ఆ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జరిగింది. స్థానికులు, నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బూర్గులతండాకు చెందిన లావూరి భారిత, మాలోతు మంగ్రి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. పొలంగట్లు చెక్కిన విషయంలో ఇద్దరి మధ్య ఈ నెల 4వ తేదీన గొడవ జరిగింది. ఈ సందర్భంగా భారితపై మంగ్రి కుమారుడు అనిల్ దాడిచేశాడు. తనపై దాడి చేసిన అనిల్‌పై పోలీసులకు భారిత ఫిర్యాదు చేసింది. ఈ విషయమై పోలీసుల సూచన మేరకు ఇరువర్గాలు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుంటుండగా, రాజీకి అంగీకరించబోనని, తన తల్లిపై దాడి చేసిన అనిల్‌పై కేసు పెట్టాలని భారిత కుమారుడు నరేందర్ పోలీసులకు స్పష్టం చేశాడు. ఈ విషయమై ఓ కానిస్టేబుల్ అనిల్ ఇంటికి వెళ్లి పోలీస్‌స్టేషన్ రావాలని కోరాడు. ఇంటి నుంచి పురుగు మందు డబ్బాను తెచ్చుకున్న అనిల్, పోలీసులు తనపై కేసు నమోదు చేస్తారనే ఆందోళనతో పోలీస్‌స్టేషన్‌లోనే పురుగు మందు మూత తీసి కొంచెం తాగాడు. పక్కనే ఉన్న హోంగార్డు వెంకటయ్య దీన్ని గమనించి పురుగుమందు డబ్బాను లాగేశాడు. అనిల్‌ను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.4 కోట్ల అప్పులు చేసి ఉడాయించిన వ్యాపారి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 7: నాలుగు కోట్లకు పైగా అప్పులు చేసి ఓ కిరాణం వ్యాపారి ఉడాయించాడు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామానికి చెందిన కామిశెట్టి పాండు(47) గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణంతో పాటు ఇతర వ్యాపారాలు కూడా నిర్వహిస్తుంటాడు. ఇందుకోసం భారీగా వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు అప్పులు తీసుకున్నాడు. రూ.2 నుంచి రూ.10 వరకు వడ్డీ చెల్లించాడు. ఒక్కో కుటుంబంలో కుటుంబ సభ్యులకు తెలియకుండా అందరి వద్దా లక్షలలో అప్పుతీసుకున్నాడు. రూ.లక్ష నుంచి రూ.60 లక్షల వరకు ప్రజలు పాండుకు అప్పులుఇచ్చారు. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తుండటంతో ప్రజలునమ్మారు. ఇటీవల కొన్ని నెలల నుంచి వడ్డీ చెల్లించడం లేదు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు డబ్బుల కోసం ఒత్తిడి తెచ్చారు. బాధితుల ఒత్తిడి పెరగడంతో ఇంటి నుంచి పరారయ్యాడు. భార్య, పిల్లలను ఇంటి వద్దే వదిలి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసి 10 రోజుల కిందట పరారయ్యాడు. బాధితులు పాండు ఇంటి వద్ద రోజు ఆందోళన చేశారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

చేనేత వస్త్రాలను ధరించాలి

భువనగిరి టౌన్, ఆగస్టు 7: అందరూ చేనేత దుస్తులు ధరిస్తూ చేనేత కార్మికులకు చేయూతను ఇవ్వాలని, చేనేత పరిశ్రమను కాపాడాలని పలువురు పిలుపునిచ్చారు. హైండ్లూం అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలో చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



భువనగిరిలో కొండాలక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కొండ లక్ష్మన్ బాపూజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దిడ్డి సత్యం, శ్రీహరి, లక్ష్మీనారాయణ, రేగొండ రాజు, కొంగరి లక్ష్మీనారాయణ, బాలరాజు, వైకుంటం, పాండు పాల్గొన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలో చేనేత కార్మిక సంఘం, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా చేనేత కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి పోచం కన్నయ్య, మండల అధ్యక్షుడు వంగరి రాములు, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు పోచం బిక్షపతి, రహీంఖాన్‌పేట సంఘం అధ్యక్షుడు కొక్కుల సత్యనారాయణ, మేనేజరు వేముల నర్సయ్య, దోర్నాల నరహరి, గుండు ప్రసాద్, నల్ల యాదగిరి, అనబత్తుల వెంకన్న, మంచె గోవర్ధన్, జిల్లా రవి, తాటి లక్ష్మణ్, మసురం కృష్ణయ్య, గుర్రం అంబదాసు, జెల్ది సోమయ్య, చంద్రశేఖర్, వరలక్ష్మీ, నర్సమ్మ పాల్గొన్నారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ, చేనేత కార్మికుల ఉపాధి కల్పనకు చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. పాలడుగు గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహానికి నూలు చిట్టి దండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యుడు చింతకింది సోమరాజు, జెల్ల సత్యనారాయణ, వడ్డెపల్లి లక్ష్మణ్, సుదర్శన్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చేనేత రంగం అభివృద్ధి- కార్మికుల సంక్షేమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ అవిరళ కృషి సాగించారని చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి సుంకి గణేష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రతినిధులు తడక నర్సింహ, పున్న సత్యనారాయణ, కర్నాటి శ్యామ్ ప్రసాద్, జిల్లా బిక్షం, పాండు, హరిశంకర్, జగదీష్ పాల్గొన్నారు.

● చేనేత కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలపై అద్భుత కళాఖండాలను సృష్టిస్తూ ప్రపంచ ప్రఖ్యాతిని గడించడంతో దేశ గౌరవాన్ని పెంపొందించడమేనని చౌటుప్పల్‌లోని ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వి.మంజుల అన్నారు. విద్యార్థులు గాంధీ వేషధారణలో రాట్నంపై దారం వొడికి ప్రశంసలను అందుకున్నారు.

రామన్నపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పద్మశాలి సంఘం నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ, మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలే వేసి నివాళులర్పించారు. చేనేత జెండాను ఆవిష్కరించారు. వెల్లంకి



వలిగొండలో లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పున్న రమేష్, సంగిశెట్టి సుదర్శన్, తౌటం భిక్షపతి, కొంగరి జానయ్య, రచ్చ యాదగిరి, పున్న వెంకటేశం, అప్పం లక్ష్మీనర్సు, పాండురంగ, పురుషోత్తం, పున్న నర్సింహ, నాగభూషణం పాల్గొన్నారు.

గుండాల: చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం సభ్యురాలు బిట్ల ఉమారాణిని బుధవారం భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్లఅయిలయ్య సన్మానించారు. సంఘం చైర్మన్ దుడుక ఉప్పలయ్య, రమేష్ తదితరులున్నారు.



రామన్నపేటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న చేనేత నాయకులు



గుండాల: ఉమారాణిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

పుట్టపాక స్టాల్‌ను సందర్శించిన మంత్రులు



పుట్టపాక స్టాల్‌ను సందర్శించిన మంత్రి సీతక్క

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని పీపుల్స్‌ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్ట్స్ సొసైటీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈస్టాల్‌ను చేనేత శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బుధవారం సందర్శించారు. మంత్రి సీతక్క పుట్టపాక చేనేత చీరను కొనుగోలు చేశారు. కార్యక్రమాంలో మాజీ సర్పంచ్ సామాల భాస్కర్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షురాలు సామల విజయలక్ష్మి, యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు గజం పుష్పలత, సామల హర్షిత్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 7: స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పిలుపునిచ్చారు. బుధవారం గుట్టలో ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి అత్యధిక గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు గెలుపొందడానికి కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రాబోయే శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంలో ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం ఇచ్చిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 7: అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను పక్కన బెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ పట్టణంలో బుధవారం బీజేపీ మునిసిపల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్నారని ఆయన విమర్శించారు. మునిసిపాలిటీ ఎన్నికల నాటికి బీజేపీని మరింత పటిష్టవంతం చేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ల అమలు కోసం ప్రజా ఉద్యమాలను సాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, కౌన్సిలర్లు పి.శ్రీధర్‌బాబు, ఆలె నాగరాజు, పట్టణ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, వనం ధనుంజయ్య, తడక సురేఖ, గోశిక నీరజ, కె.పాండు, గోశిక పురుషోత్తం, మలిగె రవి, పర్నే శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించారు.

పెండింగ్ డీఏను విడుదల చేయాలి: యూటీఎఫ్



యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు సైదులు

మోత్కూరు, ఆగస్టు 7: ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెతుకు సైదులు డిమాండ్ చేశారు. బుధవారం మోత్కూరు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, పీఆర్‌సీ కమిటీ నివేదికను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వెంకటాచారి, మండల ప్రధాన కార్యదర్శి ఎ.సత్తయ్య, నాయకులు దర్శనం వెంకన్న, ముక్కామల లింగమల్లు, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లయ్య

రామన్నపేట, ఆగస్టు 7: డ్రగ్స్, గంజాయికి బానిసలై విద్యార్థులు, యువత జీవితాలు నాశనం చేసుకోవద్దని రామన్నపేట ఎస్ఐ మల్లయ్య అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థుల బాధ్యత అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చదువుకునే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని, చదువుపై ఏకాగ్రత పెంచి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. విద్యార్థి దశలోనే జీవితం ఎటువైపు పోవాలో నిర్ణేశం జరుగుతుందన్నారు. ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే నూతన చట్టాలు కఠినంగా మారాయని విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు మేడబోయిన మమత మాట్లాడుతూ విద్యా సంస్థల్లోకి మాదక ద్రవ్యాల సంస్కృతిని నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు, మాజీ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, గట్టు నరేష్, మేకల శివ, గొరిగె వరలక్ష్మీ, పృథ్వి, నరేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలు అందించాలి

భువనగిరి టౌన్, ఆగస్టు 7: విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే సంతృప్తి లభిస్తుందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన సంఘం సభ్యుడు వెల్లంకి పురుషోత్తం రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ఆనందం, తాడూరి కిష్టయ్య, ఎం.చంద్రయ్య, కే.గోపాల్, జి.నర్సింహారెడ్డి, పడమటి పాండురంగారెడ్డి, ఉదయగిరి ప్రదీప్, ఎస్ ప్రసాద్, ఎండీ.దావూద్‌అలీ పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి జీజేసీ విద్యార్థిని ఎంపిక



మోత్కూరు, ఆగస్టు 7: మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని (2022-23, 2023-24) ఫర్హీన్‌కౌసర్ కేంద్ర మానవ వనరుల శాఖ అందించే జాతీయ ఉపకార వేతనం పొందడానికి ఎంపికైందని ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ బుధవారం తెలిపారు. ఈ విద్యార్థినికి మొదటి ఏడాది రూ.30వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.10 వేల చొప్పున పెరుగుతూ ఐదేళ్ల పాటు రూ.2.50లక్షలు ఉపకారవేతనం అందుతుందన్నారు. గత ఏడాది ఈ కళాశాలలో నలుగురు విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం లభించగా ఈ ఏడాది ప్రభుత్వం కటాఫ్ మార్కులను 927కు పెంచడంతో ఈ యేడాది 961/1000 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన ఫర్హీన్‌కౌసర్ ఒక్కరికే జాతీయ ఉపకార వేతనం లభించిందన్నారు. ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్, లెక్చరర్లు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

భువనగిరిరూరల్, ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్యాబోధన అందుతుందని భువనగిరి ఎంపీడీవో చిలుకూరి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం భువనగిరి మండలంలోని బీయన్‌తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కొద్ది సేపు విద్యాబోధన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో అందుతున్న విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఎం.దినకర్, పంచాయతీ కార్యదర్శులు కొండమడుగు అనిల్, వి.శ్రీనివాస్‌రెడ్డి, మునగాల శ్రీనివాస్, దేశెట్టి సుధాకర్, జి నర్సింగరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

భువనగిరి టౌన్, ఆగస్టు7: వెంటనే సమగ్ర కుల జనగణను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ జిల్లా జనసభ నాయకులు అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఆ పార్టీ పెద్దలు రిజర్వేషన్లకు అనుకూలమని ఢిల్లీలో ప్రకటనలు చేస్తుండగా రాష్ట్రంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉందన్నారు. దీంతో డిమాండ్ల సాధనకు ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో బీసీ సత్యాగ్రహదీక్ష చేపడుతున్నట్టు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో బీసీ నాయకులు పుట్ట వీరేశ్ యాదవ్, కస్తూరి పాండు ముదిరాజ్, గుండబోయిన సురేష్‌యాదవ్, పోల ప్రవీణ్‌గౌడ్, పి.మహేందర్, బత్క అశోక్ యాదవ్, శెట్టి శ్రీశైలం పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్ష పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చేనేత కళాకారులకు 'బాపూజీ' పురస్కారం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 7 : తెలంగాణ ప్రభుత్వం చేనేత రంగంలో విశేష ప్రతిభను చాటిన కళాకారులకు అందజేసే 'ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ' పురస్కారాలను బుధవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. ఈ మేరకు భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత డిజైనర్ ఎన్నం మాధవికి పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరలు, వస్త్రాల డిజైన్ల రూపకల్పనలో విశేష ప్రతిభను చాటినందుకు ఆమె రాష్ట్రస్థాయిలో బెస్ట్ డిజైనర్ అవార్డును అందుకున్నారు.

మోత్కూరు : పీపుల్స్‌ప్లాజాలో నిర్వహించిన జాతీయ చేనేత



మోత్కూరు: మంత్రి నుంచి అవార్డును అందుకుంటున్న సత్యనారాయణ

దినోత్సవంలో రహీంఖాన్‌పేట మార్కండేయ చేనేత సహకారం సంఘం చైర్మన్ కొక్కుల సత్యనారాయణ చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నుంచి అవార్డు అందుకున్నారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన తిరందాస్ సంతోష్‌కుమార్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందుకున్నారు. సంతోష్ కుమార్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అవార్డును ప్రదానం చేశారు. అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, రూ.25వేల నగదును అందుకున్నారు. సంతోష్ కుమార్‌కు కొండ లక్ష్మణ్‌బాపూజీ అవార్డు రావడంపై చేనేత సంఘాల నాయకులు, కార్మికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పోచంపల్లి: మంత్రినుంచి అవార్డును అందుకుంటున్న మాధవి

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు గడ్డం బాలయ్య కొండ లక్ష్మణ్ పురస్కారం అందుకున్నారు. చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి బాలయ్య ఈ అవార్డును అందుకున్నారు. 30 రకాల సహజరంగులతో నేసిన పట్టు చీరకు బాలయ్యకు ఈ అవార్డును ప్రభుత్వం అందజేసింది.



చౌటుప్పల్‌రూరల్: అవార్డు అందుకుంటున్న బాలయ్య

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి టౌన్, ఆగస్టు 7: జనగామలో లాయర్ దంపతులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. దాడిని నిరసిస్తూ బుధవారం జిల్లాలోని అన్నికోర్టుల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ మేరకు భువనగిరి కోర్టులో తెలిపిన నిరసనలో ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో భాగమైన పోలీస్ శాఖా న్యాయవాదులకు భద్రత కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, దాడి చేసినవారిపై కఠిన కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐలు నాయకులు కుక్కదువు సోమయ్య, తడక మోహన్, పాల్వంచ జగతయ్యసాయి, బొల్లెపల్లి కుమార్, శ్రీనివాస్, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, ఎండి నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : జనగాంలో న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట న్యాయవాదులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు.



చౌటుప్పల్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తప్పిపోయిన విద్యార్థి.. పోలీసుల వద్ద సురక్షితం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 7: గురుకుల విద్యార్థి తప్పిపోవడం కలకలకం సృష్టించింది. మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రూపని చరణ్ అనే విద్యార్థి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కనిపించకపోవడంతో అదే పాఠశాలలోని అతని సోదరుడు ఆరో తరగతిలోని గౌతమ్ తన సోదరుడు కనిపించడం లేదని వాళ్ల నాన్న వెంకన్నకు ఫోన్ చేశాడు. అయితే తన కుమారుడు నాలుగు గంటల వరకు కనిపించకపోవడంతో తండ్రి వెంకన్న పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. వారు గుర్తించలేక పోవడంతో తన అబ్బాయి ఆచూకీ కోసం పోచంపల్లి పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. తండ్రి వెంకన్న ఫిర్యాదుమేరకు పోలీసు దర్యాప్తు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చిట్యాలలో కెనరాబ్యాంకు వద్ద కనిపించిన రూపని చరణ్‌ను పోచంపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి మండంలోని నెమ్మాని గ్రామానికి చెందిన రూపణి చరణ్ తప్పిపోయి పోచంపల్లి పోలీసులకు చిక్కడంతో తండ్రి వెంకన్న ఊపిరి పీల్చుకున్నాడు.

పచ్చదనాన్ని పరిరక్షించాలి

రాజాపేట, ఆగస్టు 7: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, పచ్చదనాన్ని కాపాడాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. సునంద కోరారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజాపేట మండలంలోని నర్సపూర్, రేణుకుంట గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కిషన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : గ్రామ పారిశుధ్యంకోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్ కుమార్ కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో బాగంగా మండల కేంద్రంలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రధాన మురికి కాల్వలను గ్రామపంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. చెత్తను వీధుల్లో వేయకుండా, చెత్తబండీని వినియోగించుకోవాలని కార్యదర్శి ప్రజలకు సూచించారు.



రాజాపేట: రేణుకుంటలో మొక్కను నాటుతున్న డీపీవో సునంద



భువనగిరిలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి

భువనగిరి టౌన్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మురికి కాల్వలన్నింటిని శుభ్రం చేస్తూ పూడిక తీస్తున్నట్టు తెలిపారు. పలు బస్తీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి, ఎమ్మెల్యే కుమార్తె కీర్తిరెడ్డి పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె కుంభం కీర్తిరెడ్డి పట్టణంలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.